క్లుప్తంగా

శిథిలావస్థలో సామాజిక భవనం



వాయుపుత్ర కాలనీ కొండ ప్రాంతంలో సామాజిక భవనం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు వాయుపుత్ర కాలనీ పరిధి కొండ ప్రాంతంలో ఏడేళ్ల కిందట జీవీఎంసీ నిర్మించిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. దీని ఆలనా.. పాలన చూసే నాథుడు లేకపోవడంతో ఈ స్థితి చేరుకుంది. ప్రస్తుతం భవనం గోడలు పెచ్చులూడి, పగుళ్లు ఏర్పడి, రంగులు వెలిసిపోయాయి. గతంలో స్థానికులు సమావేశాలు, చిన్న చిన్న కార్యక్రమాలను ఈ భవనంలోనే జరుపుకునే వారు. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో వారికి మరో దారి లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని బాగు చేయాలని లేదా ప్రజోపయోగకర నిర్మాణం చేపట్టాలని నివాసులు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి కుటుంబానికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీకి చెందిన పైల రాజులమ్మ(48) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో శనివారం ఆమె కుటుంబ సభ్యులకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందించారు. మిగిలిన రూ.90 వేలు కుటుంబ సభ్యుల ఖాతాలో జమఅవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ రాజాబాబు , నాయకులు పెంట్ల బాలకృష్ణ, సేనాపతి తాతబాబు, గుండపు అశోక్, అన్నెపు సూర్యనారాయణ, గరుగుబిల్లి బైరాగి, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని రైతుబజార్‌లో శుక్రవారం వినియోగదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఏలియన్స్ క్లబ్, మర్రిపాలెం వుడా లేఅవుట్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు, కాలనీ వాసి ఎస్.శ్యామ్‌సుందర్ ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో మురళీ పట్నాయక్, రాజేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా సీతారామరాజునగర్ పార్క్



పార్క్‌లో పిల్లల ఆటపరికరాల ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: సీతారామరాజు నగర్ పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దుతామని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. ఈ పార్క్‌లో జరుగుతున్న పిల్లల ఆటపరికరాల ఏర్పాటు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆటపరికరాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీతారామరాజునగర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండపాటి శ్రీనివాసరాజు, ఎస్ఎస్ఎన్ రాజు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఎప్పుడు కూలుతుందో!

- శిథిలావస్థకు చేరిన గాంధీగ్రామం పశు వైద్యశాల
- బిక్కు బిక్కుమంటూ సేవలందిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



వీధి కుక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన బోనుల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



వర్షానికి ఆస్పత్రి శ్లాబ్ నుంచి కారుతున్న నీరు(ఫైల్)

సింధియా: మూగజీవాల ఆరోగ్య ప్రదాయినిగా పేరుపొందిన గాంధీగ్రామం పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుని కళావిహీనంగా మారింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ పరిధిలో ఉన్న ఈ ఆస్పత్రి భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. చిన్నపాటి వర్షానికే శ్లాబు నుంచి నీరు కారుతోంది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలమై పాములు, విష కీటాకలకు నిలయంగా మారింది. ఏ మాత్రం వర్షం కురిసినా ఆస్పత్రి లోపల నీరు చేరి చెరువును తలపిస్తోంది.

భయపడుతున్న సిబ్బంది.. ప్రజలు

ఇటీవల కాలంలో ఈ ఆస్పకి జంతువులను మూగజీవాలను తీసుకురావాలంటే భయమేస్తోందని ప్రజలు చెబుతున్నారు. శ్లాబు ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు సైతం పాడవుతున్నాయి. ఈ భవనంలో వైద్యసేవలు అందించడానికి భయమేస్తోందని వైద్యుడు డాక్టర్ సునీల్ కుమార్ తెలియజేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆస్పత్రి శ్లాబు నుంచి నీరు కారి వైద్య సేవలకు అంతరాయంగా మారింది.

వామ్మో.. పరిసరాలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు సాదాసీదాగా కనిపించే గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటి పడిన తర్వాత ఆస్పత్రి ప్రాంగణంలో ఆకతాయిలు చేరి మద్యం సేవిస్తూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. గాంధీగ్రామం పశువుల ఆసుపత్రి షిప్‌యార్డ్ పరిధిలో ఉండడంతో అభివృద్ధి చేయలేదు.

మూలకు చేరిన పాఠశాల భవనం

గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి పక్కన ఉన్న పాఠశాల వాడుకలో లేక మూలకు చేరింది. పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయి భయకరంగా మారింది. పాఠశాలను పునర్నిర్మించి మళ్లీ వాడకలో తెస్తే అందరికీ ఉపయోగపడుతుందని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా సామగ్రి

గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి ప్రాంగణంలో వీధి కుక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన బోనుల నిరుపయోగంగా ఉన్నాయి. వాటి వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి విష కీటకాలు చేరుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఆకతాయిలపై పోలీసులు దృష్టి సారించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనం

పునర్నిర్మించాలి



గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి భయంకరంగా మారింది. సిబ్బంది కూడా భయపడుతూ పని చేస్తున్నారు. ఆస్పత్రి పరిసరాలు భయంకరంగా మారడంతో మూగజీవాలను వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకురావాలన్నా భయంగా ఉంది. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించడానికి చర్యలు చేపట్టాలి.

– షణ్ముఖరావు, శ్రీహరిపురం

వైద్య సేవలకు ఆటంకం



పశువుల ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరి వైద్య సేవలకు ఆటంకంగా మారుతోంది. వర్షం పడితే నీరు చేరి వైద్య సిబ్బంది తిరగడానికే ఇబ్బందిగా ఉంటుంది. పశువులను తీసుకువచ్చిన వైద్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే నూతన భవనాన్ని నిర్మించే ఏర్పాట్లు చేయాలి.

– కృష్ణ, మల్కాపురం

త్వరితగతిన టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు

- అధికారులకు ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు ఆదేశం



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు

ఆనందపురం : నిర్మాణ పనులు పూర్తి అయిన టిడ్కో ఇళ్లకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేకాధికారి పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని దబ్బందలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దబ్బందలో 1920 ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించగా, 1728 ఇళ్ల పనులు పూర్తయినట్టు వెల్లడించారు. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. పూర్తయిన బ్లాకుల వద్ద బీటీ రోడ్లు, కాలువలు, వంతెనలు, విద్యుత్, భూగర్భ డ్రైనేజి వ్యవస్థలతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణ సదుపాయాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అవకాశాలున్నాయని, పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అమలవుతోన్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. వెల్లంకిలో అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. గుడిలోవలో జరుగుతున్న భూ రీసర్వేను, లొడగలవానిపాలెంలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, డీపీవో చక్రవర్తి, కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రపతికి ఆహ్వానం లేకపోవడం దారుణం'



సుధాకర్

గోపాలపట్నం: దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం లేకపోవడం దారుణమని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్ ఒక ప్రకటనలో నారోపించారు. ఆమెను ఎన్నుకునే సమయంలో గిరిజనులపై అమితమైన ప్రేమ ఉన్నట్లు చెప్పుకొచ్చారన్నారు. అందంతా రాజకీయ ఎత్తగడేనని ఇపుడు బీజేపీ ప్రవర్తన బట్టి అర్థమవుతుందని దుయ్యబట్టారు. ఇలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్ శుభ్రతకు చర్యలు



గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్ వద్ద కాలువను శుభ్రం చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: వేసవి క్రీడల శిక్షణ శిబిరం నేపథ్యంలో గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ బాగుపడుతోంది. కొన్నాళ్లుగా ఎవరూ పట్టికోకుండా నిర్లక్ష్యానికి గురైన ఈ మైదానం శుభ్రతకు 92వ వార్డు శానిటరీ అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజుల కిందట ఇక్కడ జీవీఎంసీ జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ పరిస్థితిని పరిశీలించి దీన్ని బాగు చేయాలని ఆదేశించారు. ఈమేరకు అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీను ఆధ్వర్యంలో మైదాన ప్రాంగణంలోని చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. కాలువను శుభ్రం చేశారు. శనివారం కూడా ఈ పనులు కొనసాగుతాయని సిబ్బంది తెలిపారు. ఇది చూసిన వారు హైస్కూల్ మైదాన ప్రాంగణానికి మంచి రోజులు వచ్చాయని సంబర పడుతున్నారు. ఇక్కడ రాత్రి సమయంలో మందుబాబుల బెడద ఎక్కువగా ఉందని, వారిని కూడా అదుపు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట ధర్నా



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని గాంధీగ్రామం ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్యం అందడం లేదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులు ప్రమాదాలకు గురై చికిత్స కోసం వస్తే మెడికల్ ల్యాబ్, ఎక్స్‌రే, స్కానింగ్ వంటి వైద్య సదుపాయాలు లేవన్నారు. డ్యూటీ డాక్టర్లు నిత్యం రద్దీగా ఉండే కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని, కార్మికుల నుంచి వేలకోట్లు రూపాయలు ప్రభుత్వాలు తీసుకుని కార్మికుడికి సరైన వైద్యం అందించకపోవడం అత్యంత దారుణమన్నారు. వెంటనే ఆపరేషన్ థియోటర్, టీబీ వార్డు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ వైద్యులను నియమించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, జీవీఎంసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 పద్మజ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార, అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు అందాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారాపై అధికారులకు నివేదించి, ఆ సమస్య సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి ఒకటి, జోన్–3 నుంచి రెండు, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి రెండు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి ఒక ఫిర్యాదు వచ్చింది. సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీ–1 కె. పద్మజ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సిటీ ప్లానర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఎం మనోజ్‌శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం విశాఖలో పర్యటించారు. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి, వివిధ విషయాలపై వారి నుంచి సూచనలు సలహాలు తీసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. ఈ పనులపై గతిశక్తి ప్రాజెక్టు అధికారులతో కలిసి సమీక్షించారు. సెల్ఫ్ ప్రొఫైల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్‌లో జీఎం మనోజ్ శర్మ మార్షలింగ్ యార్డ్, కోచింగ్ యార్డ్, గోపాలపట్నం యార్డ్, సింహాచలం నార్త్ యార్డ్ వంటి కీలక ప్రాంతాలను పర్యటించారు. అనంతరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను పరీక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌తో సమావేశమై పలు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. అదాని గంగవరం పోర్టు అధికారులతో జీఎం సమావేశమయ్యారు. చివరిగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. పర్యటనలో పలువురు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫ్రైడే–డ్రైడేపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా: వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించనప్పుడే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని బయాలజిస్ట్ చక్రవర్తి అన్నారు . జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో శుక్రవారం మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో డ్రైడే–ఫ్రైడేపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రజలు కూడా సహకరించి.. విశాఖ నగరాన్ని సీజనల్ వ్యాధులరహిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రజలు వ్యర్థాలను తడి–పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ, నారసంచులు వినియోగించాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. డెంగ్యూ కారక దోమలు మంచినీటిలోనే ఉత్పన్నమవుతాయని, 3 రోజులకు ఒకసారి మంచినీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, సచివాలయ హెల్త్ సెక్రటరీ రాము, మలేరియా సిబ్బంది మీనాక్షి, ఆశాకార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులతో కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు నిర్వహిస్తున్న జగనన్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించి క్రీడాకారులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. పిల్లలు ఆసక్తికి అనుగుణంగా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహాయసహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ రాము, కోచ్‌లు పోలారావు, సునీల్, నాయకులు పెద్దాడ ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



పిల్లలకు సూచనలిస్తున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: గుర్తుతెలియని వ్యక్తులు మాయ మాటలు చెప్పి అపహరించే యత్నాలు చేస్తారని, అటువంటి వారితో అప్రమత్తంగా ఉండాలని చిన్నారులకు జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అతిథిగా ఆమె మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా జరుగుతోందని, అమాయకులైన చిన్నారులను మోసగాళ్లు మాయ మాటలు చెప్పి అపహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి వారి వెంట వెళ్లకూడదని, ఒంటరిగా కాకుండా తల్లిదండ్రులతో కలిసి వెళ్లాలని సూచించారు. అనంతరం చిన్నారులకు డ్యాన్స్, పెయింటింగ్, సింగింగ్ తదితర వాటిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రచయిత సత్తిరాజులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ప్రాధాన్యమివ్వాలని వినతి



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత ఐక్యవేదిక సభ్యులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అచ్చెంనాయుడుతోటలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లలో అర్హులైన షెడ్యూల్ కులాల వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని మల్కాపురం దళిత ఐక్యవేదిక సభ్యులు శనివారం ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అచ్చెంనాయుడుతోటలో నిర్మించిన ఇళ్లలో పారిశ్రామిక ప్రాంతంలోని షిప్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, జింక్, కోరమాండల్, డాక్‌యార్డ్ వంటి పరిశ్రమల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి కేటాయించాలనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మల్కాపురం దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు గుడాల బాబూరావు, సెక్రటరీ సిద్ధార్థ, జనరల్ సెక్రటరీ చైతన్యకుమార్, తంతటి సంపత్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పూర్వి రాజక్‌ను అభినందించిన కలెక్టర్



పూర్వి రాజక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : విశాఖకు చెందిన పూర్వి రాజక్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ టాలెంటెడ్ కిడ్–2023గా ప్రకటించింది. దీంతో శుక్రవారం పూర్వి రాజక్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ పూర్వి రాజక్‌ను అభినందించారు. 12 సంవత్సరాల వయస్సు గల పూర్వి రాజక్ కళ, సాహిత్యం, క్రీడా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. ఆమె తన మూడు సంవత్సరాల వయసులో మొదటి అవార్డు గెలుచుకుంది. అనంతరం మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా అనేక అవార్డులు గెలుచుకుంది. స్కూలు, ఇంటర్ స్కూలు, డిస్ట్రిక్ట్, స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆర్ట్, కరాటే, ఎలక్ట్రికల్ రంగాల్లో 300 కంటే ఎక్కువ అవార్డులు, బహుమతులు గెలుచుకుంది. ఈమె పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్–2022లో నమోదు చేసింది. రచయిత్రి, కళాకారిణి, కవయిత్రి, వక్త, కరాటే నిపుణురాలు, సామాజిక కార్యకర్తగా విజయాలు సాధించి బంగారు పతక విజేతగా నిలిచింది.

ధనలక్ష్మీదేవి, దుర్గమాంబలకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని ధనలక్ష్మీదేవి ఆలయం, దుర్గానగర్‌లోని దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీదేవికి ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామాచార్యులు, దుర్గమాంబకు ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం హారత సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీల సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.